సాక్షి ప్రకాశం

మంగళవారం । 26 । నవంబర్ । 2024



కోర్టు ఆర్డర్‌తో వస్తారా.. ఉద్యోగమెలా చేస్తారో చూస్తా

ముండ్లమూరు మండలంలో వీవోఏలపై ఏపీఎం వేధింపుల వ్యవహారం చర్చనీయాంశమైంది.

- 8లో..



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

గిద్దలూరు నియోజకవర్గంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జెండర్ క్యాంపెయిన్ లాంచింగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: యూనిసెఫ్ భాగస్వామ్యంతో నాయి చేతన్ జండర్ క్యాంపెయిన్ లాంచింగ్ కార్యక్రమంలో భాగంగా జెండర్ పోస్టర్స్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. సోమవారం నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు నాలుగు వారాల పాటు నాలుగు అంశాలపై వారానికి ఒక అంశం చొప్పున కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. జెండర్ ఆధారిత హింస, ఆడపిల్లలకు విద్య, బాల్య వివాహాలు, గృహ హింస తదితర అంశాలపై లైన్ డిపార్టుమెంట్ అనుసంధానంతో చేసుకుని విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దీనిలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్, మెప్మా పీడీలు వసుంధర, జోసఫ్ కుమార్, మాధురి, రవికుమార్, డీపీఓ వెంకట నాయుడు, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, మైన్స్ డీడీ రాజశేఖర్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు గిరిజనులను వేధించడం సరికాదు



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న శ్రీరాం శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: చేయని తప్పును ఒప్పుకోమంటూ సీఎస్‌పురం పోలీసులు గరిసెకుంటకు చెందిన గిరిజనులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కొట్టడం, కేసులు పెట్టి వేధించడం మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎస్‌పురం మండలంలోని డీజీపేట సమీపంలోని పొలాల్లో ఒక యాదవ మహిళ మరణించిందని, అందుకు గరిసెకుంట్లకు చెందిన గిరిజనులైన ఇండ్ల సాలమ్మ, నరేష్, మలి దేవయ్యలే కారణమంటూ ప్రతి రోజూ పోలీసు స్టేషన్‌కు పిలిపించి కానిస్టేబుల్ శ్రీనివాస్ కొట్టి వేధిస్తున్నాడని తెలిపారు. నేరం చేసినట్లు అంగీకరించాలంటూ చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని, ఇది ఎంత మాత్రం సరికాదని చెప్పారు. కేసును తప్పుదారి పట్టించేందుకు గిరిజనులపై తప్పుడు కేసులు పెడుతున్న కానిస్టేబుల్ మీద చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు విజ్ఞప్తి చేశారు.

జియోట్యాగ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ నిర్దేశాల మేరకు ప్రతి ఇంటినీ ఫొటో తీసి జియోట్యాగ్ చేసే లక్ష్యాన్ని, నిర్దేశించిన మ్యాపింగ్‌ను ఈ నెలాఖరు లోపు నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ విధులకే పరిమితం చేస్తూ సచివాలయ సిబ్బందిని వినియోగించి పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా హాబిటేషన్లు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలని, హౌస్‌హోల్డ్ డేటాబేస్‌లో లేని వారి వివరాలను పొందుపరచాలని సూచించారు. దీనికి సంబంధించి జిల్లా వెనుకబడితే సహించేది లేదని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందికి నూరుశాతం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. బ్యాంకు ఖాతాల ఎన్‌పీసీఐ అనుసంధానం గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో కూడా చేసుకోవచ్చనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించద్దని హెచ్చరించారు. అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను డిసెంబర్ 10వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, సీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఐసీడీఎస్ పీడీ మాధురి, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు పాల్గొన్నారు.

లెక్క తేలేనా..?

జిల్లాలో పశుగణన ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతీ ఐదేళ్లకోసారి దీనిని చేపడతారు. జిల్లా వ్యాప్తంగా 6,12,564 కుటుంబాల్లో ఉంటున్న 16 రకాల జీవాలపై సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ 1,11,404 ఇళ్ల సర్వే చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. పాడి పరిశ్రమను మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన అమలు పర్యవేక్షణకు ఈ ప్రక్రియ బాగా ఉపయోగపడుతుంది. ఈ సర్వే పక్కాగా నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో లెక్కసరిగా ఉండడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.



- జిల్లాలో నత్తనడకన పశుగణన
- జిల్లా వ్యాప్తంగా 6,12,564 కుటుంబాల్లో లెక్కింపు
- ఇప్పటి వరకూ 18 శాతం మాత్రమే పూర్తి
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ప్రతి ఐదేళ్లకొకసారి లెక్కింపు
- పూర్తయితే అందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు
- 16 రకాల జంతువులపై పశుగణన

ఒంగోలు సిటీ: పాడిపరిశ్రమ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పశుగణన కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఈ సర్వేతో పశుపోషకులకు మేలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. పాలిచ్చే పశువులు, ఆవులు, పాల ఉత్పత్తి, వాటికి కావాల్సిన మందుల బడ్జెట్, మాంసం ఉత్పత్తిని పెంచేందుకు సర్వే దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి ఐదేళ్లకొకసారి గణన పూర్తి చేసి ఫలితాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. 16 రకాల జంతువులను పశుగణనలో లెక్కించనున్నారు. గతంలో 2019 లో సర్వే జరిగింది. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన పశుగణన వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగనుంది. రోజూ సుమారు 30 ఇళ్ల వరకు సర్వే చేయాలి. ఒక్కో ఎన్యూమరేటర్ పరిధిలో గ్రామాల్లో అయితే 2 వేల గృహాలు, పట్టణ ప్రాంతాల్లో అయితే 6 నుంచి 7 వేల ఇళ్లకు వెళ్లి జంతువులతోపాటు వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ సంబంధిత యంత్రాలనూ లెక్కించేలా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. గ్రామ స్థాయిలో ఉండే పశువైద్య సిబ్బంది రోజువారీ సేవలందిస్తూనే మిగిలిన సమయాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. పూర్తిచేసిన ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తారు. అలాగే వారి శాఖకు సంబంధించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

1026 రెవెన్యూ గ్రామాల్లో...

జిల్లాలోని 38 మండలాల పరిధిలోని 1026 రెవెన్యూ గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నారు. 6,12,564 కుటుంబాలకు సంబంధించిన వివరాలను 373 మంది ఎన్యుమరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకూ 605 గ్రామాల్లో 1,11,404 ఇళ్ల సర్వే చేశారు. ఎన్యుమరేటర్లను ఆయా ప్రాంతాల్లో ఉన్న పశు వైద్యాధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాల్సి ఉంటుంది. తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, వీధుల్లోని ఆవులు తదితర పశువుల సంఖ్య, జాతి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో నమోదు ప్రక్రియ సరిగా సాగటంలేదన్న ఆరోపణలున్నాయి.

ప్రత్యేక శిక్షణ:

ఈ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు ఎన్యుమరేటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారంతా పశు గణన సర్వేలో పాలుపంచుకుంటున్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తి ఎంత వరకు వస్తుందో సర్వే ద్వారా తెలుస్తుంది. పశువులకు అవసరమైన మందుల బడ్జెట్‌ను అంచనా వేసుకోవచ్చు. సర్వేకు పశుపోషకులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో పశు సంపద	
ఆవులు	56,332
గేదెలు	6,71,812
గొర్రెలు	15,67,122
మేకలు	4,17,589
కోళ్లు	8,33,434
మొత్తం	35,46,289

శిక్షణ తీసుకున్న సిబ్బందితో పశుగణన కొనసాగుతోంది



జిల్లాలో 373 మంది ఎన్యుమరేటర్లు సంబంధిత ప్రాంతాల్లోని పశువైద్యాధికారులు, పర్యవేక్షకులుగా పశుగణన ప్రారంభమైంది. ఇప్పటికే శిక్షణ తీసుకున్న సిబ్బందితో గణన కొనసాగుతోంది. గణనలో చిన్నపాటి తేడా కూడా లేకుండా లెక్క పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సర్వేను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో, పట్టణాల్లో పశుగణనకు పశుపోషకులు సహకరించాలి.

– కె.బేబీ రాణి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఒంగోలు



పశుగణన సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.బేబిరాణి

ఐదు నెలలుగా వేతనాలివ్వకుంటే బతికేదెలా..

- నగరపాలక సంస్థ కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని, కుటుంబాలను ఎలా పోషించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్లో ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ పారిశుధ్య, ఇంజినీరింగ్, క్లబ్, విద్యుత్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు 2 నెలల నుంచి 5 నెలల వరకు వేతనాలు బకాయి ఉన్నారని తెలిపారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై కార్మికులు అల్లాడిపోతున్నారని చెప్పారు. కోవిడ్ పారిశుధ్య కార్మికులకు 5 నెలలవుతున్నా వేతనాలు అందలేదన్నారు. 2024 ఏప్రిల్ నెల మెడికల్ అలవెన్సు కూడా ఇవ్వలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే మెరుపు సమ్మెలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ పీఎఫ్ రికార్డులు, ఈఎస్ఐ గుర్తింపు కార్డుల గురించి పదే పదే ప్రస్తావిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్టయినా లేదని మండిపడ్డారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరుతున్నా అధికారులు లెక్కచేయడం లేదన్నారు. అనంతరం కార్మికులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కే సామ్రాజ్యం, రత్న కుమారి, కే శ్రీనివాసరావు, యు.బాబు, దివ్య, రవి, వంశీ భారతి, జేమ్స్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె బాట

- 15 డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్న ఉద్యోగులు
- నేటి నుంచి సమ్మెలోకి
- నిలిచిపోనున్న 108 సేవలు



విజయవాడలో ధర్నా చేస్తున్న 108 ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు మస్తాన్ వలి

టంగుటూరు: ఆపద సమయంలో ఫోన్ చేయగానే కుయ్..కుయ్‌మంటూ వచ్చి అత్యవసర వైద్య సహాయం అందించే 108 అంబులెన్స్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేక సమస్యలతో సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 108 సిబ్బందిపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 25వ తేదీలోగా ప్రభుత్వం స్పందించకపోతే సేవలు నిలిపేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ముందస్తు నోటీసులు ఉన్నతాధికారులకు అందజేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి 108 అంబులెన్స్ సేవలు నిలిపేస్తూ సిబ్బంది సమ్మె చేయనున్నారు. జిల్లాలో 40 అంబులెన్స్ లు ఉండగా అందులో 5 మరమ్మతులకి గురి కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. మొత్తం 40 అంబులెన్స్ లకి 200 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 183 మంది మాత్రమే ఉన్నారు. వారిలో పైలెట్ లు 91 మంది, ఈఎంటీలు 92 మంది పనిచేస్తున్నారు.

రోగులకు అవస్థలే...

24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులు సమ్మె బాట పడితే రోగులకు పాట్లు తప్పవు. ఇప్పటికే పలు మండలాల్లో 108 వాహనాల మరమ్మతుల పేరుతో సేవలు నిలిచాయి. ఇప్పుడు సిబ్బంది సమ్మెబాట పట్టడంతో డయాలసిస్ రోగులు, రోడ్డు ప్రమాదాల బారిన పడిన వాళ్లు, గర్భిణులను తరలించేందుకు ఇబ్బందులు తప్పవు.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవీ..

- ✦ 108 సర్వీస్‌లోని ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- ✦ జీవో నంబర్ 49ను పునరుద్ధరించాలి. ఫోలేట్ గ్రాట్యూటీ, ఆర్జిత సెలవు మొత్తం, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించాలి.
- ✦ ప్రతి నెలా జీతాలు 5వ తేదీలోపు ఇవ్వాలి. 108 వాహనంలో షిఫ్ట్ లు పద్ధతి అమలు చేయాలి.
- ✦ వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- ✦ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- ✦ 108 సర్వీసులో ఈఎంటీలుగా పనిచేస్తున్న వారి సర్వీసును పరిగణలోకి తీసుకొని వైద్య ఆరోగ్య శాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలో చేపట్టనున్న ఈఎంటీ పోస్టులకు నియమించాలి.
- ✦ షిఫ్టుకు 12 గంటలు చొప్పున రెండు షిఫ్టుల్లో తీవ్ర ఒత్తిడితో పనిచేస్తున్న తమకు మూడు షిఫ్టుల్లో రోజుకి 8 గంటల పని దినాన్ని అమలు చేయాలి.
- ✦ వాహనాలను సరైన కండిషన్‌లో ఉంచాలి. వాహనం మరమ్మత్తుల బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- ✦ 108 వాహనానికి, అందులో పని చేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో భవనం నిర్మించాలి.

జిల్లాలో ఇలా ...	
అంబులెన్స్‌లు	40
మరమ్మతులకు గురైనవి	5
మొత్తం ఉండాల్సిన సిబ్బంది	200
ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది	183
పైలెట్లు	91
ఈఎంటీలు	92

సమస్యలు పరిష్కరించాలి



108 అంబులెన్స్ లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఎన్నో ఏళ్ల నుంచి 108 వాహనంలో పనిచేస్తున్నాం. మా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేసి న్యాయం చేయాలి.

– దర్గా మస్తాన్ వలి, జిల్లా 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

కొండపిలో టీడీపీ అరాచకం..

- పెద్దకల్లగుంట సర్పంచ్ సత్యనారాయణపై టీడీపీ సానుభూతిపరుల దాడి
- దాడి చేసిన ముగ్గురిలో ఇద్దరు రౌడీషీటర్లు
- మాపై దాడిచేశారంటూ ఆ ముగ్గురు సర్పంచ్ పైనే ఫిర్యాదు
- ఆలయంలో ఉన్న సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- యువకులపై వృద్ధుడు ఎలా దాడి చేస్తాడు?
- టీడీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు



పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద సర్పంచ్ సత్యన్నారాయణతో వాదులాటకు దిగిన రౌడీషీటర్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వృద్ధుడైన వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచ్ పై ఇద్దరు టీడీపీకి చెందిన రౌడీషీటర్లు, ఒక యువకుడు దాడి చేసి సర్పంచే మాపై దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనాన్ని రేకెత్తిస్తోంది. పోలీసులు జీహుజూర్ అంటూ సర్పంచ్‌ను అదుపులోనికి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఈ ఘటన సోమవారం కొండపి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దకల్లగుంట వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచ్ భువనగిరి సత్యనారాయణపై దాడి చేయటంతో పాటు అతని స్థలంలో నిర్మించిన గోడను నామరూపాల్లేకుండా జేసీబీతో టీడీపీ సానుభూతిపరులు కూలగొట్టారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మంత్రి స్వామి రెవెన్యూ అధికారులను ఆదేశించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. గొడవలకు దూరంగా ఉండాలన్న లక్ష్యంతో సత్యనారాయణ ఒంగోలులో నివాసం ఉంటున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భారీ ఎత్తున స్పర్శ దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే వేలాది మందికి భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చే క్రమంలో సత్యనారాయణ కొండపి బ్యాంకులో పని చూసుకుని తరువాత ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడి నుంచి పంచాయతీరాజ్ ఆఫీసుకు వెళ్లారు. పంచాయతీరాజ్ కార్యాలయం గేటు దగ్గర టీడీపీకి చెందిన ఇద్దరు రౌడీషీటర్లు బోయపాటి నరశింహ, కొల్లాప్రసాద్‌లతో పాటు తానికొండ శ్రీనివాసులు సర్పంచ్ ఎప్పుడు బయటకు వస్తారా అని ఎదురు చూస్తూ ఉన్నారు. సర్పంచ్ బయటకు రావడంతో ఈ ముగ్గురూ ముందస్తు పథకం ప్రకారం వాదులాటకు దిగారు. ముగ్గురు కలబడి సత్యనారాయణపై దాడిచేశారు. దీంతో అతను నన్ను కొట్టడం కాదు చంపండని అనడంతో వారు వెనక్కి తగ్గి చేతులతో కాకుండా నోటికి పనిచెప్పారు. అక్కడ నుంచి సత్యనారాయణ గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాడు. ఈ సమయంలో ఎస్సై ప్రేమ్‌కుమార్ ఫోన్ చేసి మీపై ఫిర్యాదు వచ్చింది వెంటనే స్టేషన్‌కు రావాలని సర్పంచ్‌ను ఆదేశించారు. తాను ఉపవాసదీక్షలో ఉన్నానని, ప్రస్తుతం ఆలయంలో పూజలో ఉన్నానని భోజనం చేసిన తరువాత తానే స్వయంగా స్టేషన్‌కు వస్తానని సమాధానం ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని ఎస్సై ప్రేమ్ కుమార్ తన సిబ్బందిని పంపి సర్పంచ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు పోలీసుల అరాచకాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా సర్పంచ్ వారిని వారించి పోలీస్ వాహనంలో స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు అతనిని స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అసలు నాపై ఫిర్యాదు చేసింది ఎవరు? ఏమని ఫిర్యాదు చేశారు? అని అడిగితే వారి నుంచి సమాధానం లేదు. ఎస్సై వస్తారు సమాధానం చెప్తారు అన్న మాటలే పోలీసుల నోటి నుంచి వస్తున్నాయని సర్పంచ్ ఆరోపిస్తున్నారు. వృద్ధుడైన తనపై రౌడీషీటర్లు దాడి చేస్తే వారిని శిక్షించకుండా ఫిర్యాదు వచ్చిందని తనను స్టేషన్‌లో కూర్చోబెట్టడం ఏంటి? ఇదేనా రెడ్‌బుక్ రాజ్యాంగం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సర్పంచ్ సత్యనారాయణకు 70 సంవత్సరాలు ఉండగా, అతనిపై దాడి చేసిన వారు ముగ్గురు 45 సంవత్సరాల లోపు వారే. వారిపై ఈయన దాడిచేశాడంటే ఎవరైనా నమ్ముతారా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సీఐ సోమశేఖర్‌ను వివరాలు అడగగా తాను అందుబాటులో లేనని, సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తనకు తెలియదని చెబుతున్నారు. ఎస్ఐ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తాను కోర్టు పనిమీద వెళ్లి వస్తున్నానని, ఏదైనా గొడవలు జరుగుతాయని సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అర్ధరాత్రి పోలీసులు సర్పంచ్‌ను వదిలిపెట్టారు.



కొండపి పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మహిళలు

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులంతా అధిక ప్రాధాన్యం ఇచ్చి పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రీవెన్స్ హాలులో మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను నిర్ణీత గడువులో నాణ్యమైన పరిష్కారం చేయాలన్నారు. ఏ సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఎంతో నమ్మకంతో అధికారుల వద్దకు వచ్చే ప్రజల సమస్యలను శాశ్వతమైన పరిష్కారం చూపి వారి సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 266 అర్జీలు ప్రజలు అందజేశారు. గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు వరకుమార్, లోకేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

★ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి సభ్యులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి దివ్యాంగులు అర్జీలు ఇచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ప్రతినెలా ఒక రోజు ప్రత్యేకంగా కేటాయించి గ్రీవెన్స్ నిర్వహించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

★ నగరానికి చెందిన కుంచాల రాంబాబు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు ఉన్న డివైడర్ పెయింటింగ్ పనులు చట్ట ప్రకారం తమకు వచ్చాయని, అయితే మున్సిపల్ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులు ఈ టెండర్ ద్వారా తమ పనులకు సంబంధించి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకున్నారని, తమకు ఇచ్చిన అగ్రిమెంట్ మేరకు తనకు పనులు కేటాయించాలని దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

★ మద్రిపూడి మండలానికి చెందిన పులిచర్ల వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు 75 శాతం కన్ను కనిపించక ఇబ్బంది పడుతున్నానని, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని కంటి సమస్యలతో ఏ పనిచేయలేక ఇబ్బంది పడుతున్న తనకు ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో చిన్న ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందచేశాడు.

క్లుప్తంగా

వెలుగు సీసీ సస్పెన్షన్

రాచర్ల: రాచర్ల వెలుగు కార్యాలయంలో గుడిమెట్ట క్లస్టర్ సీసీగా పనిచేస్తున్న షేక్.నాయక్‌రసూల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధులకు గైర్హాజరు కావడం పాటు అనుమలవీడు అంకిత పొదుపు గ్రూప్ ఆన్‌లైన్‌లో లేకపోయినప్పటికీ ఒక సభ్యురాలు, ఒక లీడర్ తీర్మానంతో సీసీ సంతకాలు చేసి రూ.53,733 నిధులను డ్రా చేసి అదే గ్రామానికి చెందిన బి.ప్రవళికకు అందించినట్లు విచారణలో తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీని సస్పెండ్ చేసినట్లుగా ఐకేపీ ఏపీఎం రమేష్‌బాబు సోమవారం తెలిపారు.

90 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



ప్రభుత్వ ముద్రతో ఉన్న బియ్యం బస్తాలు

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని మండలంలోని ఆదిమూర్తిపల్లె గ్రామ సమీపంలో పోలీసులు ఆదివారం అర్ధరాత్రి సీజ్ చేశారు. గిద్దలూరు, కొత్తకోట గ్రామంలోని ప్రభుత్వ రేషన్ దుకాణాల నుంచి బియ్యం బస్తాలను ఆటోలో వైఎస్సార్ జిల్లాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆదిమూర్తిపల్లె వద్ద పోలీసులు రేషన్ బియ్యం వాహనాన్ని అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన వాహనంలో ఎఫ్‌సీఐకి చెందిన 26 గోనె సంచులు ఉండటం గమనార్హం. బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ కరాటే పోటీలకు మార్కాపురం విద్యార్థి



జాతీయ పోటీలకు ఎంపికైన భార్గవ్

మార్కాపురం: జాతీయ స్థాయి కరాటే పోటీలకు మార్కాపురం విద్యార్థి జేకేఎస్‌సీ భార్గవ్ అండర్–17 విభాగంలో ఎంపికైనట్లు పట్టణంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తెలిపారు. 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ కరాటేలో భాగంగా ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో భార్గవ్ ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఇవే పోటీల్లో అండర్–14 విభాగంలో జె.సాయిత్రిష, సౌజన్య ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

కోర్టు ఆర్డర్‌తో వస్తారా..
ఉద్యోగమెలా చేస్తారో చూస్తా..

- టీడీపీ కార్యకర్తలా ముండ్లమూరు ఏపీఎం ప్రవర్తన
- వీఓఏలపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి నిత్యం వేధింపులు
- బలవంతంగా తొలగించి.. ఇంటికొచ్చి రికార్డులు ఎత్తుకెళ్లిన వైనం
- కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తానంటూ హూంకరింపు
- ఏపీఎం వైఖరిపై మీ కోసంలో జేసీకి ఫిర్యాదు చేసిన వీఓఏలు



మీ కోసం ఫిర్యాదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తున్న వీఓఏలు

ముండ్లమూరు(దర్శి): కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన దరిమిలా చిరుద్యోగులపై మొదలైన వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పారిశుధ్య సిబ్బంది, డ్వాక్రా వీఓఏలు.. ఇలా చిరుద్యోగులంతా కూటమి నేతల దెబ్బకు హడలిపోతున్నారు. తాజాగా ముండ్లమూరు మండలంలో వీఓఏలపై వేధింపుల వ్యవహారం చర్చనీయాంశమైంది. ముండ్లమూరు మండల వెలుగు ఏపీఎం హనుమంతరావు వ్యవహార శైలి టీడీపీ నేతలకు ఏమాత్రం తీసిపోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ ముఖ్య నేతల నుంచి తనపై ఒత్తిళ్లు ఉందని, ఉద్యోగాల నుంచి తప్పుకోవాలని వీఓఏలను బలవంతం చేయడంతో కొందరు వైదొలిగారు. మరికొందరిని ఉద్దేశపూర్వకంగా తప్పించి వేరొకరిని చేర్చుకున్నారు. తొలగించిన వారి నివాసాలకు వెళ్లి ఏపీఎం బలవంతంగా రికార్డులు తీసుకెళ్లడం గమనార్హం. ముండ్లమూరు మండలంలో మొత్తం 9 మంది వీఓఏలను బలవంతంగా తొలగించారు. దీంతో వారు కోర్టుకు వెళ్లి మళ్లీ విధుల్లో చేరేలా ఆర్డర్ తెచ్చుకున్నారు. కోర్టు ఆర్డర్‌తో వచ్చిన వీఓఏలను ఉద్దేశించి ఏపీఎం చేసిన వ్యాఖ్యలు న్యాయస్థానాన్ని ధిక్కరించేలా ఉన్నాయి. 'కోర్టు ఆర్డర్‌తో వస్తారా? మీరు ఉద్యోగాలు ఎలా చేస్తారో నేను కూడా చూస్తా' అంటూ ఏపీఎం బెదిరిస్తున్నారని వీఓఏలు వాపోయారు. మరి కొందరు వీఓఏలనూ రాజీనామా చేయాలని బలవంతం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదలా ఉండగా వీఓఏ పోస్టులను రూ.50 వేలకు బేరం పెట్టి, టీడీపీ నేతలు చెప్పిన వారినే నియమిస్తున్నారని స్థానికంగా చర్చ నడుస్తోంది. తొలగించిన వీఓఏలు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్న నేపథ్యంలో ఇప్పటికే రూ.50 వేలు చెల్లించిన వారు తమ పరిస్థితి ఏమిటని టీడీపీ నేతలను నిలదీస్తున్నారు.

కోర్టును ఆశ్రయించింది వీరే..

చిన్న ఉల్లగల్లుకు చెందిన కందుల కృపమ్మ, ఆవుల విజయలక్ష్మి(వేములబండ), అనపర్తి శ్రావణి(ఉమామహేశ్వరపురం), మదలపు రజని(శంకరాపురం), తాడిపర్తి కీర్తి(పసుపుగల్లు), కోణంకి కృష్ణకవిత(జమ్మలమడక), మైలా మల్లేశ్వరి(సుంకరవారిపాలెం)ని బలవంతంగా తొలగించారు. వీరంతా కోర్టును ఆశ్రయించి రీజాయిన్ అయ్యేందుకు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. మరికొందరు కోర్టు ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఏపీఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తమకు జరుగుతున్న అన్యాయంపై వీఓఏలు సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తమ వద్ద రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో 'మేము ఇవ్వలేం సార్, అంత స్థోమత లేదని చెప్పగా ఏపీఎం కోపంతో వెళ్లిపోయారు' అని వివరించారు. కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొచ్చినా విధుల్లో చేర్చుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని, రికార్డులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ చెక్ పవర్ రద్దు చేయాలని ఏపీఎం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారని, ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జేసీ విచారణకు ఆదేశించినట్లు వీఓఏలు తెలిపారు.

మా ఇంటికొచ్చి రికార్డులు లాక్కెళ్లారు



నన్ను మానుకోమని ఒత్తిడి చేస్తున్నారు. మీటింగ్ పెట్టి మెజార్టీ ప్రకారం అందరూ ఉంచమంటే ఉంచండి లేదంటే తీసేయండి అని చెప్పా. మాకు లక్ష్మీ మేడం నుంచి ఒత్తిడి ఉంది అని ఏపీఎం, సీసీలు మా ఇంటికి వచ్చి పుస్తకాలు బలవంతంగా తీసుకుని వెళ్లారు.

– డొక్కా రూబీ సంధ్యారాణి, పసుపుగల్లు వీఓఏ–2

ప్రభుత్వం మారిందని నన్ను తొలగించారు

నేను కోర్టును ఆశ్రయించగా మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. అయినా తన విధులకు ఆటకం కలిగిస్తూ మానుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. నా లాగిన్ కూడా ఆపారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయి మేమేం చేయలేమని ఏపీఎం గద్దిస్తున్నారు. నా రికార్డులు కూడా ఇవ్వడం లేదు.

– పందుల కృపమ్మ, ఉల్లగల్లు వీఓఏ

తీర్మానం లేకుండా విధుల నుంచి తప్పిస్తున్నారు



కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా మీరు ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తామని బెదిరిస్తున్నారు. మా విధులకు ఆటంకం కలిగించవద్దని, విధుల్లో కొనసాగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఏపీఎం ధిక్కరిస్తున్నారు.

– తాడిపర్తి కీర్తి, పసుపుగల్లు వీఓఏ–1

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు, బైక్ అదుపుతప్పి మరొకరు దుర్మరణం
- కారు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన పఠాన్ ఇమ్రాన్‌ఖాన్



బైక్ ప్రమాదంలో మృతి చెందిన రామాంజనేయులు

బేస్తవారిపేట/గిద్దలూరు రూరల్: గిద్దలూరు నియోజకవర్గంలో సోమవారం సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. బేస్తవారిపేట మండలంలోని శాంతినగర్ సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు బలంగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. కర్నూలుకు చెందిన పులిచింతల ఇమ్రాన్‌ఖాన్, ఖాజా బాషా, ఇర్ఫాన్ ఖాన్, అల్తాఫ్ మాష్ ఒంగోలులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కారులో తిరుగు ప్రయాణంలో ఉండగా శాంతినగర్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. తెల్లవారుజామున దట్టమైన మంచు కారణంగా ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు రోడ్డుపై రెండు పల్టీలు కొట్టడంతో ఇమ్రాన్‌ఖాన్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అయింది. మృతుడు కర్నూలులో లెన్స్‌కార్ట్ సంస్థ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య నసరీన్, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు



చికిత్స పొందుతున్న ఖాజా, అల్తాఫ్

పొగనారు తెచ్చేందుకు వెళ్తూ..

పొలంలో నాట్లు వేసేందుకు పొగనారు కోసం వెళ్తున్న యువకుడిని మృత్యువు కబళించింది. గిద్దలూరు మండలంలోని కొండపేట–అంబవరం మధ్య సోమవారం వేకువజామున చోటుచేసుకున్న ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గడికోట గ్రామ పంచాయతీలోని పరమేశ్వరనగర్‌కు చెందిన కాకి రామాంజనేయులు(24) పొగనారు కోసం అంబవరం గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ప్రస్తుతం 7 నెలల గర్భవతి కాగా ఒక కుమారుడు కూడా ఉన్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చందలూరు పీహెచ్‌సీలో డీవైఎంహెచ్‌ఓ తనిఖీ



హాజరు రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీవైఎంహెచ్‌ఓ సృజన

సాక్షి ఎఫెక్ట్..

దర్శి: పీహెచ్‌సీల్లో కొందరు వైద్యులు తరచూ విధులకు గైర్హాజరవుతున్న తీరుపై 'సర్కారీ వైద్యం.. నామమాత్రం' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 23న ప్రచురితమైన కథనంపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. చందలూరు పీహెచ్‌సీని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన సోమవారం తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లు పరిశీలించి, సిబ్బందిని విచారించారు. అనంతరం గ్రామస్తులతోనూ మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని సర్పంచ్ భర్త సుబ్బారావుతోపాటు గ్రామస్తులు కోరారు. హాజరు రిజిస్టర్ల విషయమై విచారణ చేస్తున్నామని, వాటిని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలని సూచించామన్నారు. రోజూ విధులకు హాజరు కావాలని వైద్యులను ఆదేశించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలో నలుగు డాక్టర్లకుగాను ఇద్దరే ఉన్నారని, ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. నైట్ డ్యూటీ నర్సును కూడా అలాట్ చేశామని చెప్పారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం



క్యాన్సర్ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ జమున

- మంగళ, గురువారాల్లో ప్రత్యేక ఓపీ

ఒంగోలు టౌన్: క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్యాన్సర్ ఓపీ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్లను త్వరితగతిన గుర్తించి వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది సూచనలు, సలహాల మేరకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు జీజీహెచ్‌లో వైద్య సేవలను పొందాలని సూచించారు. ప్రతి మంగళ, గురువారం రోజున క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున మాట్లాడుతూ.. గుట్కా, పాన్ అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పలు దశల్లో శిక్షణ పొందిన సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, క్యాన్సర్ అనుమానిత లక్షణాలు కలిగిన వారిని గుర్తించి జీజీహెచ్‌లోని ఆంకాలజీ విభాగానికి పంపిస్తారని వివరించారు. క్యాన్సర్ ఓపీ విభాగంలో మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ మాధవీలత, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూరిబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, డాక్టర్ బాలాజీ నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- ఎస్పీ ఏఆర్ దామోదర్



కానిస్టేబుల్ భార్యకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ భాగ్యరాజు సతీమణి ఝాన్సీకి పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును ఎస్పీ సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. దర్శి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జి.భాగ్యరాజు ఈ నెల 22న తన ఇంట్లో ప్రెజర్ కుక్కర్ మూత తీస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. కుక్కర్‌లో ఉన్న పదార్థం ముఖం, ఛాతీ, ఇతర శరీర భాగాలపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఒంగోలులోని ఉషా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కానిస్టేబుల్ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎస్పీ వెంటనే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. కానిస్టేబుల్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, వైద్య సహాయం కోసం ఎప్పుడైనా సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీకి కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతి లేకుండా
అడవిలో ప్రవేశిస్తే కఠిన చర్యలు



రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచరిస్తున్న వ్యక్తులు

- ఫారెస్ట్ డీఆర్‌ఓ నాగరాజు హెచ్చరిక



డీఆర్‌ఓ నాగరాజు

మార్కాపురం: మార్కాపురం రిజర్వు ఫారెస్టులో పులుల సంచారం ఉండటం వల్ల అనుమతి లేకుండా అడవిలోకి ప్రవేశించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసరు జి.నాగరాజు హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2022 ఆగస్టు నుంచి ప్రాజెక్టు టైగర్‌లో మార్కాపురం ప్రాంతం చేరిందన్నారు. మానవతా దృక్పథంతో పశువులు, మేకలు, గొర్రెల మేతకు వెసులుబాటు ఇచ్చామని, అయితే కొంతమంది వన్యప్రాణులను వేటాడుతూ, చెట్లు నరుకుతున్నారని చెప్పారు. వారిని ప్రశ్నిస్తే తమపైనే దాడులు చేస్తున్నారన్నారు. జాతి సంపద, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. గుండం చర్ల బీటు పరిధిలోని రిజర్వు ఫారెస్టులో కొంతమంది కుక్కలతో వన్యప్రాణులను వేటాడుతున్నారనే సమాచారంతో ఈనెల 22న అక్కడికి వెళ్లామని, మధ్యాహ్నం సమయంలో చీరమాను ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు కుక్కలతో కనిపించారని వివరించారు. వారిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారని, తనతోపాటు అటవీ సిబ్బంది జి.నాగయ్య, వెంకటరమణ, టి.బాలాకుమారిపై దాడి చేశారని చెప్పారు. గ్రామంలో విచారించి కొండేటి అంకయ్య, దూదేకుల ఖాశింపీరా, బోగెం వెంకటేశ్వర్లును నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోనూ తమపై దాడికి ప్రయత్నించగా స్థానికుల సాయంతో బయటపడి పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై దాడి చేసినవారే మళ్లీ మార్కాపురం వచ్చి ధర్నా చేశారన్నారు. కాగా అటవీశాఖ అధికారులపై దాడిని ఖండిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పి.కరీముల్లా ఖండించారు. ఫారెస్టు ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. అటవీ ప్రాంతంలో జరిగిన సంఘటనకు సంబంధించి ఫొటోలు విడుదల చేశారు.

యూరప్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు బాధితుడి ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: యూరప్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దొనకొండకు చెందిన ఇద్దరు వ్యక్తులు అదే మండలంలోని పలువురు వ్యక్తుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసం చేశారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. అలేగే దర్శికి చెందిన ఒక వ్యక్తి తన కారును రూ.4 లక్షలకు బేరం కుదుర్చుకొని కొనుగోలు చేశాడని, రూ.2 లక్షలే ఇచ్చి బెదిరిస్తున్నాడని ఒంగోలు వాసి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ సమస్య పూర్వాపరాలు తెలుసుకున్నారు. చట్టపరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడిన ఆయన బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై షేక్ రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



గణపతి చెక్ పోస్టు వద్ద బారులు తీరిన వాహనాలు

పెద్దదోర్నాల: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రానికి భారీగా తరలి వచ్చిన భక్తులతో పెద్దదోర్నాల రద్దీగా మారింది. శ్రీశైలం మార్గంలోని గణపతి చెక్ పోస్టు గుండా రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచే వాహనాలు నిలిచిపోయాయి.